


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### బయోస్కోప్ పిల్లొచ్చింది

**చిన్నప్పుడు యాదగిరి** కొట్టుకి అమ్మమ్మతో వెళ్ళి, ఆవిడ "కిలో చింతపండూ, మూడు కిలోల పల్లీనూనె, రెండు కిలోల కందిపప్పూ" అని చెప్తుంటే, అక్కడున్న పెద్ద పెద్ద సీసాల్లోంచి, తన చేతినిండా పిప్పరమెంట్లు తీసి నా గుప్పెటనిండా పోసేవాడు యాదగిరి. అసలందుకే నేను అమ్మమ్మతో వెళ్ళేదాన్ని. పచారీ షాపుకి వింజామరల్లా అటూ ఇటూ కొండ చీపురూ, కొబ్బరి చీపురూ పెట్టుకుని, రెండువందల రూపాయలకి బియ్యంతోసహా సమస్తం కొనుక్కుని ఇంటికొచ్చేవాళ్ళం రిక్షాలో. కాళ్ళదగ్గర వేసిన బియ్యం బస్తామీద నేనుకాళ్ళు కిందకేసుకుని కూర్చునేదాన్ని. అప్పటినుండే అమ్మమ్మ "ఈ లెఖ్ఖచూడు. క్యూటికురా పౌడర్ ఎంతేసాడూ?" అని తను డబ్బా మీద రేట్ చెకింగ్ చేసేది. అతని కూడికలు మరోసారి తనిఖీ చేసేది. "సింగార్ తిలకం, ఐటెక్స్ కాటుక డబ్బా, రీటా హెయిర్ ఆయిల్, క్యూటికురా పౌడర్, కుంకుడుకాయలూ మా సౌందర్య సాధనాలు.

రిక్షా సందు మొదట్లో వున్న సైదులు మిరపకాయబజ్జీల బండి దగ్గర ఆపించేదాకా గోల చేసేదాన్ని. అసలు అతను ఎలా చేసేవాడో ఏం చేసేవాడో, ఆ రుచి మళ్ళీ ఇన్నేళ్ళల్లో ఒక్కసారి కూడా తినలేదు అంటే నమ్మండి. సన్నగా పొడువుగా వుండేవి బజ్జీలు ఇంతింతలావున బండగా కాదు. వాటిలో పుల్లగా జీలకర్ర రుచితో వున్న మసాలా పైన పుదీనా చట్నీ నీళ్ళలాంటిది జల్లేవాడు. ఆ ఘుమఘుమలకసలు విశ్వామిత్రుడైనా మేనకనీ, తపస్సునీ వదిలి రావలసిందే అలా వుండేవి ఘుమఘుమలు. అవి రెండురూపాయిలిస్తే 24 కట్టిచ్చేవాడు. 4 రూపాయలవి కట్టించినా సరిపోయేవి కావు. అంత జనాభా వుండేది మా ఇంట్లో. పెద్దమ్మ పిల్లలు ముగ్గురు అక్కలూ, ఒక అన్నయ్యా, మా అమ్మ పిల్లలం మేం ఇద్దరం. మరి తినాలిగా. అందుకే వంటింటి వసారాలో గబగబా కంచాలు పెట్టేసేదాన్ని. వేడి చల్లారకుండా, వేడి వేడి అన్నంలో అద్దుకు తినేసేవాళ్ళం. అసలు అంతంత ఆకళ్ళు ఎలా వుండేవో? అమ్మ ఇడ్లీలు తెప్పిస్తే, మరచెంబునిండా సాంబారూ, పెద్ద పొట్లం పచ్చడీ కట్టించేవాడు. ఆ సాంబారు ఇప్పటిలాకాదు, తిన్నాక రోజంతా అరచెయ్యి ఘుమాయించిపోయేది. ఎప్పుడైనా పెద్దమ్మావాళ్ళొచ్చినప్పుడు సుధా హోటల్‌కి వెళ్తే చిక్కడిపల్లిలో, ఇడ్లీలు అప్పుడే వయసొచ్చిన కన్నెపిల్లల చెక్కిళ్ళలా మృదువుగా, వేలేస్తే జారిపోయేవి. ఆ సొట్టల్లో నేతి బొట్టు వేసి, పక్కన ఇచ్చిన కారం పొడీ, చెట్నీ సాంబార్‌తో తింటూంటే, పైన ఇంకో స్వర్గం వుందని ఎవరైనా చెపితే కొట్టాలనిపించేది. పేపర్ దోస... టేబుల్ అంతా పరుచుకునేది తెప్పిస్తే, పిల్లలం తెగనవ్వి, చెరోపక్కనుండీ తుంపుకుని తినేవాళ్ళం. అమ్మ కడుపునిండా పెట్టించేది. అసలా కాఫీ రుచి మాత్రం జన్మలో మరచిపోలేం. బాలాజీ బజరంగ్ దగ్గర ఆగి ఫస్ట్

తారీఖునాడు స్వీట్స్ కొనాల్సిందే పాలకోవా, మైసూర్ పాక్, బాద్‌షా కొనేది. అలా మా అమ్మమ్మ తల్లికోసం, తియ్యబూంది కూడా కొనేది. నాకైతే కరకజ్జం బజ్జీల బండి పక్కన, మూకుడులో రౌండ్ రౌండ్‌గా వేసే జిలేబీలే చాలా ఇష్టం. అసలు చిక్కడపల్లి ఎంత కలర్‌ఫుల్‌గా వుండేదో సాయంత్రాలు.. సుదర్శన్ 35ఎం.ఎం, 70 ఎమ్ ఎమ్, ఇంకాస్త ముందుకి వెళితే నారాయణగూడాలో వెంకటేశా, శ్రీనివాసా, అటెళ్ళకుండా తిన్నగా వెళితే దీపక్ మహల్. ఇంకా తిన్నగా పోయి, సర్కిల్ దగ్గర కుడిచేతి వైపు చూస్తే శాంతీ థియేటర్ ఇంక స్వర్గం కాక ఏవిటీ? ఆ సినిమా బోర్డులు చూడ్డానికి మేమూ, మమ్మల్ని చూడ్డానికి మా కాలనీ కుర్రాళ్ళూ రోజూ సాయంత్రాలు చిక్కడపల్లి వెళ్ళేవాళ్ళం. వయసు మళ్ళిన వాళ్ళు గుళ్ళకీ, నడివయసు వాళ్ళు సిటీ సెంట్రల్ లైబ్రరీకీ, త్యాగరాజ గాన సభకీ వెళ్ళేవాళ్ళు. రోడ్డుకి అటూ ఇటూ బళ్ళు పెట్టి, పళ్ళూ, పూలూ, అమ్ముతుంటే పేవ్‌మెంట్స్ మీద చెప్పులూ, బట్టలూ, బ్యాగ్‌లూ మొదలైనవి అమ్మేవారు.

సాలమ్మ ఇనప సామాన్ల షాప్, పోస్టాఫీస్‌ని ఆనుకుని ఉండేది. ఆ షాప్‌లో మా అక్కలకీ, నాకూ కూడా కొత్త కాపురం పెట్టేటప్పుడు ఇంటెడు సామాను కొనిచ్చింది అమ్మమ్మ. ఇనప పట్టకార్లూ, కుంపటీ, జల్లెడా, పిండి జల్లెడా, అప్పడాల పీటా, కర్రా, ఇనప బూర్లె మూకుడూ,అట్లకాడా, కత్తిపీటా, బియ్యం కొలిచే పావూ, కిరోసిన్ డబ్బాలోంచి తోడే బొంబాయీ.. ఇలా ఇంటికి కావలసిన సామానంతా అక్కడే కొనేవాళ్ళం చాటలూ, పీటలూతో సహా! ఎందుకైనా మంచిదని నల్లని పెద్ద గొడుగులూ, సూట్‌కేసూనూ. తరవాత్తరువాత గౌసు ఇనపబీరువాల షాప్ పెట్టాడు. ఎవరింట్లోనైనా ఇనప బీరువా వుంటే వాళ్ళు గొప్పవాళ్ళు అన్నమాట. పవిత్రా స్టౌ నూతన్ స్టౌ మీద కుక్కర్ కూడా పది నిమిషాల్లో విజిల్ వచ్చేసేది. ఇంక కుంపటి విసరాలంటే పీటేసుకుని కూర్చుని తాటాకు విసినికర్రతో విసురుతూ కూర్చునేవాళ్ళం.

ఈ పోస్టాఫీస్‌కి ఎదురుగా "శిల్పమన్‌దిర్" అని వుండేది రెండు సింహాల బొమ్మలూ, ఒక డాన్సు చేసే అమ్మాయి బొమ్మా రాతితో చెక్కినవి ఆ ఇంట్లో వుండేవి. భవానీ వాళ్ళమ్మ ఆ ఇంట్లోకి వెళ్ళేటప్పుడు తోడెళ్ళేదాన్ని. అప్పుడే రాతితో బొమ్మలు చెక్కితే 'శిల్పం' అంటారని తెలిసింది.

భవానీ వాళ్ళమ్మ మాత్రం శిల్పాలమీద అభిరుచితో వెళ్ళేది కాదు. అక్కడ నాగరాజులెవరూ లేరు, నేనూ మల్లీశ్వరిలా వెళ్ళడానికి, ఆ ఇంటాయన, వెండి కంచమో, ఇత్తడి చెంబో పెట్టుకుని డబ్బులిచ్చే షావుకారు అనమాట. వాళ్ళ వాకిలి మంచి రద్దీగా బస్సులు తిరిగే రోడ్డు మీదకుండేది. అది ఇల్లెలా అవుతుందీ, షాప్ అవుతుందికానీ అనుకునేదాన్ని. వెండి కంచం నలభై రూపాయిలకీ, ఇత్తడి బిందె పదిరూపాయిలకీ, నెలాఖరిలో తాకట్టు పెడ్తూ వుండేవారు పాపం ఇల్లాళ్ళు. వాచీలూ, బిగ్‌బెన్‌లూ, ట్రాన్సిస్టర్లూ కూడా పెట్టడం చూసేదాన్ని.

"ఎందుకే?" అంటే "హిందీ నేర్చుకోడానికి పంపిస్తున్నాం మార్వాడీ దగ్గరకి" అని భవాని నవ్వేది. వాళ్ళమ్మ దగ్గరే పేడతో పిడకలు చెయ్యడం, గుండ్రంగా వుండలు చెయ్యడం దీక్షగా నేర్చుకుంటుంటే, సందానీగాడు చూసి మా అమ్మమ్మతో "ఏ.వీ రమణీ పిడకలు చేసి అమ్ముతున్నయి" అన్నాడు ఆవిడ బెత్తం పుచ్చుకుని వచ్చింది. ఏదో చేతి కళలు నేర్చుకుంటోంది పిల్ల అన్న కళాదృష్టిలేదు.

అసలు నా స్కూల్‌కి వెళ్ళడం యాత్ర. ఎప్పుడూ సజావుగా ఇంటి దగ్గర ప్రారంభమై స్కూల్ దగ్గర ఆగేది కాదు. మా సందానీ వెధవ "అదిగో కోతులాడిస్తున్నయ్" అనేవాడు. వెళ్ళి కూర్చునేవాళ్ళం. నా జామెంట్రీ బాక్స్‌లో పదిపైసల బిళ్ళవుంటే, ఆ కోతులాడించే అతనితో కోతికే ఇస్తాననేదాన్ని. అది దగ్గరకొచ్చి చేతిలోంచి తన మెత్తని అరచేత్తో తీసుకుని, ఓసారి 'కిచకిచ'మని తన ఫారూకీ దంత సౌందర్యాన్ని చూపించేది.

సందానీ వాటికి సెనక్కాయలు కూడా పెట్టేవాడు. వాడికి జేబులెక్కువ, చొక్కా తక్కువగా వుండేది. వాడి జేబులన్నీ తనిఖీ చేసి, ఖాళీ చేసి వుతుక్కపోతే, వాడి అమ్మీజాన్ చేతిలో బ్లేడో, సూదో దిగిపోవడం ఖాయం. అలా కోతిని "నీ పుట్టింటికి నీళ్ళు తీసుకురా" అంటే, కుండనెత్తి మీద పెట్టుకుని తెచ్చేది, పొందిగ్గా, పొడవాటి తోక వెనుక గొల్లభామలా వూపుతూ అదే "మీ అత్తగారింటికి నీళ్ళు తీసుకురా" అనగానే, కుండ ఎత్తి పడేసేది. మేమంతా అక్కడే కిందపడి భళ్ళున నవ్వేవాళ్ళం. అలా మొదటి పిరేడ్ గంట కొట్టేసేవాళ్ళు. గేట్

దగ్గర పీ.టీసార్ మసి మొహం వేసుకుని తనకన్నా పొడవు బెత్తం తీసుకుని రెడీగా వుండేవాడు. జీప్..జీప్.. అని శబ్దం వచ్చేట్లు రెండు అంటించి స్కూల్లోకి వదిలేవాడు. అసలే స్కూలు ఇష్టంలేదు. పైగా వదిలినందుకు దెబ్బలా? అని నేనొక్కోసారి వెనక్కి తిరిగి చక్కా పరిగెత్తుకొచ్చేసేదాన్ని.

బడి నుంచి ఇంటికొచ్చేదారిలో ఓ స్మశానం వుండేది. ఆ శ్మశానంలో సమాధులన్నీ అతి ప్రశాంతంగా, గంభీరంగా తపస్సు చేసుకుంటున్నట్లు కనిపించేవి నాకు. వారికి గొడుగు పెడ్తున్నట్లు చింత చెట్లూ. నేను ఒక సమాధినానుకుని కూర్చుని, సందానీగాడొస్తే వాడితో బఠానీలు తింటూ బాతాఖానీ వేసేదాన్ని. "ఇందులో ఉన్నదెవరో తెలుసా? ఆ కొండమీదుండే నవాబుగారి రెండో పెళ్ళాం. ఆ చివరిది ఆయనది. ఆ పక్కది ఆయన రెండో పెళ్ళానిది" అని.

"ఆ చిన్న సమాధి ఆయన చిన్నప్పుడిదా?" అని వాడు ధర్మ సందేహాలు కూడా అడుగుతుండేవాడు. "మీకసలు దెయ్యాలంటే భయాలు లేవా? అవి మనని పడ్తాయి తెలుసా?" అనేవారు మంజూ వినోలియా వాళ్ళు. నేను సందానీతొ "ఒరేయ్ ఆ నవాబుగారి దగ్గర చాలా డబ్బులూ, బంగారం వుండేవిట్రా ఎక్కడ దాచాడో అడుగుతాను. ఒకసారి పట్టించుకోరా" అని బతిమాలేదాన్ని. కానీ వాడిది ఎముకలగూడులాంటి దేహం. వాటికి, అదే నవాబుగారికి నచ్చకేమో పట్టలేదు. వెనుక వీధిలోనున్న లీలమ్మ కోడలు సుశీలకి పట్టాడు. ఆ అమ్మాయి జుట్టు విరబోసుకుని, అత్తగారినీ, మొగుడ్నీ చీపురుకట్టా, గొడుగూ, ఆర్.ఎస్.ఎస్ వాళ్ళ దండా తీసుకుని ఉతుకుతుంటే మేం కిటికీల్లోంచి ఆశ్చర్యంగా చూసేవాళ్ళం.

మా అమ్మమ్మ ఆరుబయట నవారు మంచం వాల్చుకుని, కలబందాలో వక్కలు నూరుతూ, "దెయ్యం లేదు, గియ్యంలేదు. ఆ అత్తా మొగుడూ అనుమానంతో కాల్చుకుని తింటూంటే, ఆ పిల్ల ఈ దెయ్యం నాటకం ఆడ్తోంది" అని ఓనాడు చెప్పేసింది. ఈలోగా మస్తాన్ ఫకీర్ వచ్చి, విభూది పెట్టి నెమలీకతో 'ఉఫ్..ఉఫ్'మని వూది, ఆ పిల్ల ముందు సాంబ్రాణి ధూపం వేసి, ముగ్గులో కోడి గుడ్లూ, నిమ్మకాయలూ పెట్టి, దెయ్యాన్ని ఓ సీసాలో పట్టి, దానితోబాటు వాళ్ళింట్లో వున్న డబ్బులు అన్నీ కూడా పట్టుకెళ్ళిపోయి ఆ దెయ్యాన్ని వదిల్చాడు.


ఇంకో రోజు స్కూల్‌కి వెళ్తుంటే నాగరాజు ఎదురొచ్చేవాడు అంటే 'పాములవాడు' నేను ఇంట్లోకి వెళ్ళి "అమ్మా పాలు పోసివ్వు గ్లాసులో పాముకివ్వాలి" అని జ్యోతిలక్ష్మీ, జయమాలినీ, హలం ఒకేసారి పూనినట్లు కాళ్ళూ చేతులూ కొట్టుకుని ఏడిస్తే, మా అన్నయ్య "పాములు పాలు తాగవే సైన్స్ ప్రకారం" అని చెప్తున్నా అమ్మ పోన్లే పాపం అని పాలు పోసిచ్చేది. దాంతోపాటు పావలా కూడా. మళ్ళీ అతను నాదస్వరం వాయించడం, అది పడగెక్కి ఆడడం చప్పట్లు కొడ్తూ చూస్తేవాళ్ళం. తర్వాత ఆ సాయిబూ, పాము కరిస్తే వేరూ, మందూ, మూలికలు ఏవో అమ్మేవాడు. మా సందానీ ఓ వేరు కొనుక్కొచ్చి "అబ్బాజాన్‌కి పాము కరిస్తే బాగుంటయ్... నేను మందు ఇస్తా" అని చాలా రోజులు ఎదురు చూసాడు. ఓ రోజు అనుకోకుండా అబ్బాజాన్, ఎలక్ట్రిక్ పోలెక్కి షాక్ కొట్టి పడ్డాడు. మనిషి మనలో లేడు బిర్ర బిగుసుకుపోయాడు. ఇంటికి స్ట్రెచర్ మీద తీసుకొచ్చారు. డాక్టరొచ్చి సూది గుచ్చినా కనుగుడ్లు తిప్పలేదు. వీడి అమ్మీజాన్, చిన్నమ్మా ఉమ్మడిగా పుట్టిన ఐదుగురు సంతానం ఘొల్లుమనిపోయారు. ఎవరో డాక్టర్‌తో "షాక్‌లిస్తే లేస్తాడేమో" అంటే, ఆయన "అసలే షాక్ కొట్టి పడిపోయాడు మళ్ళీ కరెంట్ ఏవిటయ్యా" అని కయ్యిమన్నాడు. ఏవనుకున్నాడో సందానీగాడు లోపలికెళ్ళి ఆ వేరు అరగదీసి నీళ్ళల్లో కషాయం కలుపుకొచ్చి వాళ్ళ నాన్న ముక్కుమూసి పోసేసాడు. అంతే.... పెద్ద తుమ్ముతో వాళ్ళ అబ్బాజాన్, మిడి గుడ్లేసుకుని లేచి కూర్చున్నాడు. అంతే అందరూ సందానీని "భలే విరుగుడు తెచ్చావురా" అని మెచ్చుకున్నారు. అలా ఆ వేరు పనికొచ్చింది. ఆ వాసన, రుచీ అలాంటివి మరి.


గంగిరెద్దులవాళ్ళు, తోలుబొమ్మలవాళ్ళు, అమ్మవారి విగ్రహంతో, డప్పులు వాయిస్తూ వచ్చేవాళ్ళు, కొరడాలతో కొట్టుకునేవాళ్ళు. నడిపించు నా నావ ముష్టివాళ్ళు ఎవరింట్లోనో, స్టీలు గిన్నెల బేరం పాతబట్టలతో, ఇలాంటి వన్నీ నన్ను స్కూల్‌కి వెళ్ళకుండా ఆపేసేవి.

ముఖ్యంగా ఒకరోజు నన్ను అసలు స్కూల్‌కి వెళ్ళకుండా వీళ్ళతో వెళ్ళిపోదాం అని ఆపేసిన బండి మాత్రం 'బయొస్కోప్' ఆ సైకిల్‌కి ఓ డబ్బా అమర్చి, అందులోకి ఒక బైనాక్యులర్స్ లాంటిది పెట్టి "బాలచంద్రుని రోషం చూడూ, బ్రహ్మనాయుని మీసం చూడూ" అని పాడ్తూ, పావలా ఇస్తే సినిమా బొమ్మలు చూపిస్తూ వుంటే వాళ్ళతో చాలా దూరం వెళ్ళిపోయాను. సందానీగాడుకూడా నేను ఎక్కడా కనపడక, సమాధుల దగ్గరకెళ్ళి "మాకీ ఎ.వీ రమణీకీ ఇచ్చెయ్యి" అని నవాబుని వేడుకుని కంగారు పడిపోయాడుట. మధ్యాహ్నానికి వాళ్ళు ఓ చెట్టుకింద అన్నాలు తింటూ ఇంటర్వెల్ ఇచ్చినప్పుడు వెనక్కి వస్తుంటే అమ్మమ్మ ఓ జువ్వ చేత్తో పట్టుకునొచ్చి "నువ్వా నీ సినిమా పిచ్చీ ఎక్కడిదాకా పోతావ్? వాళ్ళు ఎత్తుకుపోతారు తెలుసా?" అని అరుస్తూ తోలు లేచేదాకా కొట్టింది.

కానీ అమ్మమ్మ భయపడ్డట్టే నేను సినిమా పిచ్చితో, సినిమావాళ్ళ దగ్గరకి వెళ్ళిపోయాను. అప్పుడు ఆవిడ తెరమీద నా పేరు చూసి మురిసిపోయిందేమో మరి.

Post your comments




https://www.youtube.com/watch?v=ERaaX_IulS4